నమస్తే తెలంగాణ
నల్లగొండ
3 | నల్లగొండ, గురువారం 5 డిసెంబర్ 2024 | NALGONDA

నాడు 150 మంది.. నేడు 9 మంది

ఆత్మకూరు(ఎం) బీసీ బాలుర వసతి గృహంలో గణనీయంగా పడిపోయిన విద్యార్థుల సంఖ్య

ఆత్మకూరు(ఎం)లోని బీసీ బాలుర వసతి గృహం

ఆత్మకూరు(ఎం), డిసెంబర్ 4 : వెనుకబడిన తరగతుల పిల్లలకు నాణ్యమైన విద్యను అందించే ఉద్దేశంతో 2015లో బీఆర్ఎస్ ప్రభుత్వం మండల కేంద్రంలో రూ.80లక్షలతో బీసీ బాలుర వసతి గృహాన్ని సకల సౌకర్యాలతో నిర్మించింది. ప్రారంభంలో 150 మంది విద్యార్థులు ఉండగా ఆ తర్వాత 120మంది, 84 మందికి చేరింది. ఈ సంవత్సరం 38మంది విద్యార్థులున్నట్లు రికార్డులు చెబుతున్నాయి. కానీ ఉంటున్నదని 9మంది విద్యార్థులేనని అధికారుల తనిఖీలో తేలింది. వసతి గృహానికి రెగ్యులర్ వార్డెన్ లేకపోవడంతోపాటు ఇన్‌చార్జి వార్డెన్‌ను నియమించడం, పర్యవేక్షణ లోపంతో విద్యార్థుల సంఖ్య తగ్గుముఖం పట్టిందని తెలుస్తున్నది. దీంతో వసతి గృహం మూత పడేందుకు సిద్ధంగా ఉన్నట్లు సమాచారం.

రుణమాఫీ ముగిసినట్లేనా!

ప్రభుత్వ తీరుపై ఎన్నో సందేహాలు

అదిగో.. ఇదిగో అంటూ నాలుగో విడుతల వరకూ నెట్టుకు వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వానికి ఇప్పటికీ సంపూర్ణంగా రుణమాఫీ చేసేందుకు మనస్సు రాలేదు. ఆగస్టు 15 వరకు మూడు విడుతలుగా రుణమాఫీ చేయగా, అప్పటికీ ఉమ్మడి నల్లగొండ జిల్లాలో కనీసం మరో రెండు లక్షలకు పైగా రైతులు రుణమాఫీకి దూరంగా ఉన్నారు. వారంతా మరో విడుతలో మాఫీ అవుతుందని ఎదురుచూస్తూనే ఉన్నారు. మూడున్నర నెలల తర్వాత నాలుగో విడుత మాఫీని ప్రకటించినా అందులోనూ మరో 50 వేల మంది వరకే మోక్షం కలిగింది. మిగతా వారికి రుణమాఫీ జరుతుందా, లేదా అన్నది సందేహంగా మారింది. ఆది నుంచి రుణమాఫీ విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం లబ్ధిదారుల సంఖ్యను, వారి కోసం వెచ్చించాల్సిన డబ్బును ఎంత వీలైతే అంత కుదించేందుకు ప్రయత్నిస్తున్నది. పలు రకాల సర్వేల తర్వాత కూడా అందరికీ రుణమాఫీ కాకపోవడంతో రైతులు తీవ్రంగా మండిపడుతున్నారు.

– నల్లగొండ ప్రతినిధి, డిసెంబర్4(నమస్తే తెలంగాణ)

- సాంకేతిక కారణాలతో ఎంతోమంది దూరం
- నాలుగో విడుతలోనూ దక్కని మాఫీ
- రూ.2లక్షలపైన రుణాల మాఫీ ఎప్పుడో!
- అంతులేని కథలా రుణమాఫీ అమలు తీరు

మూడు విడుతల అనంతరం రుణమాఫీ కాని వారిలో రేషన్‌కార్డు లేని వాళ్లు, ఒక కుటుంబంలో ఉన్న వ్యక్తులకు రెండు లక్షలకు మించి రుణం ఉన్నవాళ్లు, ఆధార్, బ్యాంకు అకౌంట్, పట్టాదారు పాస్‌పుస్తకం నెంబర్లతోపాటు పేర్లు సరిపోలకపోవడం వంటి సమస్యల వాళ్లు ఉన్న విషయం తెలిసిందే. నిజానికి రుణమాఫీ కాకపోవడానికి 31 కారణాలు ఉన్నాయని స్వయంగా రాష్ట్ర వ్యవసాయ శాఖనే గుర్తించి ప్రభుత్వానికి నివేదించింది. అలాంటి వారంతా రుణమాఫీ కోసం అప్పట్లో రోడ్లెక్కారు. బీఆర్ఎస్, ఇతర విపక్ష నేతలు, రైతు సంఘాల ఆధ్వర్యంలో ఆందోళనలకు దిగారు. దాంతో ప్రభుత్వం తప్పనిసరి పరిస్థితుల్లో రుణమాఫీ కాని వారి వివరాల సేకరణ పేరుతో సర్వేకు ఆదేశాలిచ్చింది. ముందుగా రేషన్ కార్డు లేని వారి కుటుంబ నిర్ధారణ కోసం ఫొటోలు దింపుతూ వివరాలు సేకరించింది. సాంకేతిక కారణాలు, పేర్లు, అకౌంట్లుల్లో తప్పులు ఉన్న వారి నుంచి తగిన ఆధారాలు తీసుకుంఇది. దాంతో వారంతా నాలుగో విడుత రుణమాఫీపై ఆశలు పెట్టుకున్నారు. తీరా ఐదు రోజుల కిందట వచ్చిన జాబితాలోనూ అతికొద్ది మందికే మాఫీ చేస్తున్నట్లు ప్రకటించడంతో విస్తుపోయారు. ఇందులో ఎక్కువగా రేషన్ కార్డు లేకుండా 2లక్షల వరకు రుణమాఫీ ఉన్న వారికే మాఫీ చేసినట్లుగా జాబితాలు స్పష్టం చేస్తున్నాయి. మరో లక్షన్నర మంది రైతులు ఉమ్మడి జిల్లాలో మరోవిడత రుణమాఫీ కోసం ఎదురుచూడక తప్పడం లేదు. సాంకేతిక కారణాలతో పెండింగ్‌లో ఉన్న రూ.30వేలు, 40 వేల రుణాలున్న రైతులవి సైతం మాఫీ కాకపోవడం విస్మయం కలిగిస్తున్నది. ఇక రూ.2లక్షలకు పైబడి రుణాలున్న రైతులవి సైతం రూ.2లక్షల వరకు మాఫీ చేస్తామని ప్రభుత్వ పెద్దలు చెప్పారు. వారివి కూడా ఇప్పటికీ పెండింగ్‌లోనే ఉన్నాయి. మూడో విడత అనంతరం రూ.2లక్షలకు పైబడి రుణం ఉన్న రైతులకు అదనంగా ఉన్న అప్పును బ్యాంకులకు చెల్లిస్తే మాఫీ చేస్తామని చెప్పడంతో అప్పట్లోనే చాలామంది రైతులు అప్పుసొప్పు చేసి డబ్బులు కట్టారు. కానీ ఇలాంటి రైతుల రుణమాఫీ ప్రస్తావన నాలుగో విడతలోనూ ఊసే లేదు. నిర్దిష్టమైన గడువు ఏదీ పెట్టలేదు. ప్రభుత్వానికి రుణమాఫీ విషయంలో చిత్తశుద్ధి లేకపోవడంతోనే రైతులు ఇబ్బందికి గురవుతున్నారన్నది నిజం. ఎంత వీలైతే అంత సాగదీయడమే లక్ష్యమన్నట్లుగా ప్రభుత్వ వ్యవహారశైలి కనిపిస్తున్నదని రైతు సంఘాల నాయకులు విమర్శిస్తున్నారు. తిరిగి తిరిగి విసిగి వేసారి చివరకు రైతులే రుణమాఫీపై ఆశలు వదులుకునేలా చేయడమే ప్రభుత్వ వ్యూహమన్నట్లుగా తెలుస్తున్నది.

రుణమాఫీ నాలుగో విడుత జాబితాలో పేరు ఉందా లేదో నల్లగొండలోని జేడీఏ కార్యాలయంలో చెక్ చేసుకుంటున్న రైతులు

కేసీఆర్ హయాంలో ఇలా...

గతేడాది ఆగస్టులో కేసీఆర్ సర్కార్ చేసిన రుణమాఫీలో ఇలాంటి చిక్కులేవీ లేవు. 2018 ఎన్నికల హామీలో భాగంగా కేసీఆర్ ప్రకటించిన లక్ష రూపాయల రుణమాఫీలో రూ.99,999 వరకు చేశారు. అప్పట్లో పాస్‌పుస్తకమే ప్రామాణికంగా రుణమాఫీ చేయడంతో దాదాపు రుణాలు తీసుకున్న రైతులందరికీ రుణమాఫీ లబ్ధి చేకూరింది. కేసీఆర్ పాలనలో రూ.99,999 వరకు రుణమాఫీని అమలు చేస్తేనే ఉమ్మడి జిల్లాలో 4,00,518 మంది రైతులకు మొత్తం రూ.2159.77 కోట్ల ప్రయోజనం జరిగింది. ప్రస్తుతం నాలుగు విడుతల్లో కలిపి రూ.2లక్షల వరకు రుణాలు మాఫీ చేసినా రైతుల సంఖ్య నాలుగు లక్షలకు చేరుకోలేదు. కేసీఆర్ హయాంలో లక్ష లోపు రుణమాఫీ జరిగిన రైతుల సంఖ్యనే ప్రస్తుతం రెండు లక్షల రుణమాఫీ జరిగిన రైతుల సంఖ్య కంటే ఎక్కువ ఉండడం గమనార్హం.

రైతులను ముంచుతున్న రేవంత్ సర్కారు

ఎన్నికల ముందు 2 లక్షల రుణమాఫీ చేస్తామని చెప్పిన రేవంత్ రెడ్డి సీఎం అయ్యాక రైతులు నిండా ముంచుతున్నాడు. నేను లక్షా 61 వేల 650 రూపాయలు వ్యవసాయ రుణం తీసుకున్నా. ప్రభుత్వ నిబంధనల కటాఫ్ డేట్‌లోనే ఉంది. రేషన్ కార్డు లేదు. కుటుంబ నిర్ధారణ లిస్టులో పేరు వస్తే సంబంధిత పత్రాలను అధికారులకు ఇచ్చా. మూడో లిస్టులో రుణమాఫీ అవుతుందనుకున్నా. కానీ ప్రభుత్వం ప్రకటించిన జాబితాలో నా పేరు రాలేదు. వ్యవసాయాధికారులు, బ్యాంకు అధికారులను అడిగినా సమాధానం లేదు. కాంగ్రెస్ ప్రభుత్వం చేతగాని మాటలు చెప్తూ రైతులను మోసం చేస్తున్నది.

- ఎర్రమాద నితీశ్‌కుమార్‌రెడ్డి, పెద్దసూరారం, నల్లగొండ మండలం

రుణమాఫీ కాలేదు

నాకు ఐదెకరాల భూమి ఉంది. సిండికేట్ బ్యాంకులో లక్ష రూపాయల రుణం తీసుకున్నాను. మొదటి విడుతలో ప్రకటించిన రుణమాఫీ జాబితాలో నా పేరు రాలేదు. రెండో విడుతలో అవుతుందేమోనని ఆశగా ఎదురు చూశాను. అయినా కాలేదు. అధికారులను ఎన్నిసార్లు అడిగినా ఫలితం లేకపోయింది. ఇప్పటికీ నా లోన్ మాఫీ కాలేదు.

-పంబిరి నాగయ్య, రైతు, గంగానగర్, గరిడేపల్లి మండలం

నల్లగొండలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి, పక్కన జడ్పీ మాజీ చైర్మన్ బండ నరేందర్‌రెడ్డి

ప్రారంభించే ప్రాజెక్టులు మావే...

జిల్లాకు మీరిచ్చే నిధులేంటో ప్రకటించాలి

- బీఆర్ఎస్ హయాంలోనే మెడికల్ కళాశాల, వైటీపీఎస్, బ్రాహ్మణ వెల్లంల ప్రాజెక్టులు
- మా ప్రాజెక్టులు ప్రారంభిస్తూ మాపై విమర్శలా?
- నల్లగొండకు సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్, ఎస్ఎల్‌బీసీ కాల్వల అభివృద్ధికి నిధులు ఇవ్వాలి
- బీఆర్ఎస్ పాలనలో రూ.1,350కోట్లతో నల్లగొండ అభివృద్ధి
- మాజీ ఎమ్మెల్యే కంచర్ల, మాజీ జడ్పీ చైర్మన్ బండ

నల్లగొండ, డిసెంబర్ 4 : 'రాష్ట్రంలో విద్యుత్ సమస్య పరిష్కారానికి దామరచర్లలో యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్, పేద విద్యార్థులను వైద్యులుగా తీర్చిదిద్దాలనే ఆలోచనతో నల్లగొండలో మెడికల్ కళాశాల, రైతులకు సాగు నీరు ఇవ్వాలని ఎస్సెల్బీసీ కింద చేపట్టిన బ్రాహ్మణ వెల్లంల ప్రాజెక్టులకు బీఆర్ఎస్ హయాంలోనే నిధులు ఇచ్చి పనులు చేశాం. మా ప్రాజెక్టులు ప్రారంభించడానికి వస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి మీ పాలనలో నల్లగొండకు ఏం ఇస్తారో చెప్పాలి' అని నల్లగొండ జడ్పీ మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్ రెడ్డి, మాజీ చైర్మన్ బండ నరేందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈ నెల 7న సీఎం రేవంత్ రెడ్డి నల్లగొండకు వస్తున్న నేపథ్యంలో బుధవారం జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. మాజీ ఎమ్మెల్యే కంచర్ల మాట్లాడుతూ బీఆర్ఎస్ పాలనలో రూ.1,350కోట్లు తీసుకొచ్చి నల్లగొండ నియోజకవర్గం రూపురేఖలే మార్చామన్నారు. ప్రధానంగా రోడ్ల విస్తరణ, మెడికల్ కళాశాల, ఐటీ హబ్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. దామరచర్ల మండలంల యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్, నకిరేకల్‌లో బ్రాహ్మణ వెల్లంల ప్రాజెక్టుకు నిధులు కేటాయించి పూర్తి చేశామని, కేవలం వాటి ప్రారంభించడం కాకుండా నల్లగొండ జిల్లా అభివృద్ధికి ఏం నిదులు ఇస్తారో చెప్పాలన్నారు. నల్లగొండలో రూ.250కోట్లతో సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ నిర్మించడంతోపాటు పట్టణంలోని వార్డుల అభివృద్ధికి రూ.200 కోట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. తాను రూ.234కోట్లతో రూపకల్పన చేసిన ప్రాజెక్టులైన ఉదయ సముద్రం, పచ్చల, ఛాయా సోమేశ్వరాలయాల అభివృద్ధి, శిల్పారామం, మాస్టర్ ప్లాన్ కోసం ఉద్దేశించిన నిధులను డైవర్ట్ చేయకుండా వాటిని యథావిధిగా అభివృద్ధి చేయాలని కోరారు. బ్రాహ్మణ వెల్లంలకు నీటి కేటాయింపులు లేవని, రూ.35కోట్ల కమీషన్‌కు కక్కుర్తి పడ్డ కోమటిరెడ్డి ఈ ప్రాజెక్టు తీసుకొచ్చారని ఆరోపించారు. దాని ఉద్దేశం నెరవేరాలంటే ఎస్సెల్బీసీకి మరో రూ.1,500కోట్లు వెచ్చించి నాలుగు వేల క్యూసెక్కుల సామర్థ్యంతో కాల్వల లైనింగ్ చేపట్టాలన్నారు. నల్లగొండలో నిర్వీర్యం చేసిన ఐటీ హబ్‌కు పూర్వ వైభవం తీసుకురావాలన్నారు. మూసీ పాపం కాంగ్రెస్‌ది అయితే ఎస్టీపీల ద్వారా శుద్ధి చేసి సాగు నీరు ఇచ్చిన ఘనత బీఆర్ఎస్‌ది అని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై ఏడాది కాలంలోనే ప్రజలు తిరగబడ్డారని, ఎప్పుడు ఎన్నికలు వచ్చిన బీఆర్ఎస్‌దే విజయమని ధీమా వ్యక్తం చేశారు.

సాధించిందే లేనప్పుడు విజయోత్సవాలు ఎందుకు? : బండ

ఏడాది కాలంలోనే ప్రజల నుంచి తీవ్రమైన వ్యతిరేకత ఎదుర్కొన్న కాంగ్రెస్ పార్టీ అసలు సాధించిందే లేనప్పుడు విజయోత్సవాలు ఎందుకని, ప్రజా ధనం దుర్వినియోగం ఎందుకు చేస్తున్నారని నల్లగొండ మాజీ జడ్పీ చైర్మన్ బండ నరేందర్‌రెడ్డి ప్రశ్నించారు. ఆరు గ్యారెంటీల్లో ఇప్పటి వరకూ ఏ ఒక్కటి కూడా పూర్తిగా అమలు చేయకపోవటంతోపాటు ఇక్కడ సంపదను దోచి ఢిల్లీ పెద్దలకు రేవంత్ సర్కార్ కప్పం కడుతున్నదని ఆరోపించారు. దేశంలో ఎక్కడ ఎన్నికలు జరిగినా తెలంగాణ నుంచే డబ్బు వెళ్లే పరిస్థితి ఉందన్న ఆయన మంత్రులు సైతం నిత్యం అవినీతి దిశలనే వెతుకుతున్నట్లు పేర్కొన్నారు. దేశానికి దిక్సూచిగా నిలిచిన గురుకులాలను కాంగ్రెస్ ప్రభుత్వం భ్రష్టు పట్టించి పిల్లలకు కనీసం మంచి భోజనం కూడా అందించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. 55వేల ఉద్యోగాలు ఇచ్చామని గొప్పలు చెప్పడం కాదని, అందులో 12వేలు మినహాయిస్తే మిగిలినవన్నీ బీఆర్ఎస్ హయాంలోనే నోటిఫికేషన్లు వేసిన విషయాన్ని మర్చిపోవద్దని గుర్తుచేశారు. కేసీఆర్ ఇచ్చిన కాళేశ్వరం ప్రాజెక్టుతో కోకో కోలా ప్రాజెక్టును ప్రారంభించటం, నాణ్యమైన కరెంట్ ఇవ్వకపోవడంతో రైతులు ఇబ్బంది పడడం నిజం కాదా అని ప్రశ్నించారు. ఈ నెల 7న నల్లగొండకు చేపట్టడానికి వస్తున్న సీఎంకు వివిధ అభివృద్ధి పనుల డిమాండ్లలతో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో పెద్దఎత్తున కదిలివెళ్లి వినతి పత్రం ఇవ్వనున్నట్లు బండ, కంచర్ల తెలిపారు. సమావేశంలో బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి నిరంజన్ వలీ, మాజీ మున్సిపల్ చైర్మన్ మందడి సైదిరెడ్డి, బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు బోనగిరి దేవేందర్, కటికం సత్తయ్య గౌడ్, బొర్ర సుధాకర్, అభిమన్యు శ్రీనివాస్, కరీం పాష, నారబోయిన భిక్షం, లొడంగి గోవర్ధన్, వంగాల సహదేవరెడ్డి, దోటి శ్రీనివాస్, దేప వెంకట్ రెడ్డి, అయితగోని యాదయ్య, మారగోని గణేశ్, యుగంధర్‌రెడ్డి, రంజిత్, రావుల శ్రీనివాస రెడ్డి, మెరుగు గోపీనాథ్ పాల్గొన్నారు.

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

ప్రజలకు ఏం చేశారని విజయోత్సవాలు?

- ఆరు గ్యారెంటీల అమలుపై చిత్తశుద్ధి కరువు
- ఏడాది పాలనలో ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత
- మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

నార్కట్‌పల్లి, డిసెంబర్ 4 : ఎన్నికల సమయంలో ఆరు గ్యారెంటీలంటూ ఓట్లు దండుకొని దొడ్డిదారిన గద్దెనెక్కిన కాంగ్రెస్ నేతలు ఏడాది కాలంలో ఏం చేశారని విజయోత్సవాలు నిర్వహిస్తున్నారని నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య ప్రశ్నించారు. బుధవారం తన నివాసంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆరు గ్యారెంటీల పేరుతో ప్రజలను మోసం చేసినందుకు సంబురాలు జరుపుకొంటున్నారని ఎద్దేవా చేశారు. మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్ రావు ప్రభుత్వ తీరును ప్రశ్నిస్తుంటే అక్రమ కేసులు పెడుతున్నారని మండిపడ్డారు. గురుకులాల్లో నెలకొన్న సమస్యలపై ప్రశ్నిస్తే గొంతు నొక్కాలని చూస్తున్నారన్నారు. పింఛన్ల పెంపు, కళ్యాణలక్ష్మిలో తులం బంగారం ఏమయ్యాయని ప్రశ్నించారు. రైతు భరోసా ఎగ్గొట్టారని, రైతులందరికీ రుణమాఫీ చెయ్యకుండా చేతులు దులుపుకొన్నారని విమర్శించారు. కాంగ్రెస్ పాలనలో రైతులు ధాన్యం విక్రయించుకునేందుకు కూడా తీవ్ర అవస్థలు పడాల్సిన దుస్థితి నెలకొందని పేర్కొన్నారు. గురుకులాల్లో కలుషిత ఆహారం తిని ఏడాది కాలంలో 46 మంది విద్యార్థులు మృతి చెందినా మంత్రులు, ఎమ్మెల్యేలకు చీమ కుట్టినట్టయినా లేకుండా పోయిందని మండిపడ్డారు. కాంగ్రెస్ పాలనపై ఏడాదికే ప్రజల్లో తీవ్రమైన వ్యతిరేకత వచ్చిందన్నారు. కొవిడ్ సమయంలోనూ రైతులకు ఇబ్బందులు ఎదుర్కొనకుండా కేసీఆర్ కడుపులో పెట్టుకొని చూసుకున్నారని గుర్తుచేశారు. కార్యక్రమంలో రైతు బంధు సమితి మండల మాజీ కన్వీనర్ యానాల అశోక్ రెడ్డి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు బైరెడ్డి కరుణాకర్ రెడ్డి, మాజీ ఎంపీటీసీలు మేకల రాజిరెడ్డి, చిరుమర్తి యాదయ్య, దుబ్బాక శ్రీధర్, కొండూరి శంకర్, దోపపాటి విష్ణుమూర్తి, బోయపల్లి శ్రీను, పనసం వెంకటయ్య, నర్సింహ, నడింపెల్లి నరేశ్, మహేశ్, డీజే రాజు పాల్గొన్నారు.

స్థానిక సంస్థలపై నిర్లక్ష్యం

సూర్యాపేట జిల్లాలో పర్యవేక్షణకు అధికారులే లేరు

- ఖాళీగా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్, డీపీఓ, జడ్పీ సీఈఓ పోస్టులు
- 8 మండలాలకు ఎంపీడీఓలు లేరు.. మూడు చోట్ల ఎంపీఓలు కరువు
- 90 గ్రామాల్లో కనపడని కార్యదర్శులు



సూర్యాపేట, డిసెంబర్ 4 : కాంగ్రెస్ సర్కారు స్థానిక సంస్థల పాలన అధ్వానంగా మారుతున్నది. ఎన్నికలు నిర్వహించకపోవడంతో పాలకులు లేకపోగా, పర్యవేక్షణ చేస్తూ ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు అధికారులను సైతం ఇవ్వడం లేదు. స్థానిక సంస్థల పర్యవేక్షణ కోసం గత ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రత్యేకంగా క్రియేట్ చేసిన స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పోస్టు సూర్యాపేట జిల్లాలో 4 నెలల నుంచి ఖాళీగా ఉంది. పంచాయతీలను పర్యవేక్షించాల్సిన జిల్లా పంచాయతీ అధికారి పోస్టు సైతం ఖాళీనే. జిల్లా పరిషత్ సీఈఓ పోస్టును ఇన్‌చార్జీతో నెట్టుకొస్తున్నారు. మండలాల్లో కీలకంగా పని చేసే ఎంపీడీఓలు 8 మండలాలకు, ఎంపీవోలు 3 మండలాలకు లేరు. వాటిల్లో మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి దంపతులు ప్రాతినిధ్యం వహిస్తున్న కోదాడ, హుజూర్‌నగర్ ప్రాంతాల్లోనే అధికంగా ఉన్నారు. మరోవైపు సుమారు 90 మందిపంచాయతీ కార్యదర్శుల వివిధ కారణలతో సెలవులు పెట్టడం, ఏ కారణమూ లేకుండా ఉద్యోగం బంద్ చేయడంతో ఆ స్థానాల్లో ఇన్‌చార్జీలతోనే నెట్టుకొస్తున్నారు.

గ్రామ పంచాయతీలు, మండల పరిషత్‌ల పాలక వర్గాలు గడువు ముగియడంతో రద్దయిపోయాయి. ప్రభుత్వం ఎన్నికలు నిర్వహించకపోవడంతో గ్రామాలకు, మండలాలకు ఇన్‌చార్జీలను నియమించి పాలన సాగిస్తున్నారు. వారితో పనులు చేయించాల్సిన లోకల్ బాడీ అదనపు కలెక్టర్ పోస్టు జిల్లాలో నాలుగు నెలలుగా ఖాళీగా ఉంది. ఆగస్టు 3న ప్రియాంక బదిలీపై వెళ్లగా, నాటి నుంచి ఆ సీటు ఖాళీగానే ఉంది. దాంతో కలెక్టరే అదనపు బాధ్యతలు చూస్తున్నారు. మరోవైపు కొత్త సంవత్సరం ప్రారంభంలోనే మున్సిపాల్టీల పాలక వర్గాలు సైతం రద్దు కానున్నాయి.

జిల్లా పరిషత్ సీఈఓ పోస్టును సైతం ఇన్‌చార్జీతోనే నెట్టుకొస్తున్నారు. జడ్పీ సీఈఓగా జిల్లాకు వచ్చిన అప్పారావుకు జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారిగా పూర్తి స్థాయి బాధ్యతలు అప్పగించి జిల్లా పరిషత్‌కు మాత్రం ఇన్‌చార్జి సీఈఓగా అదనపు బాధ్యతలు ఇచ్చారు. గ్రామ పంచాయతీలను చూసుకోవాల్సిన అధికారే లేకపోవడం గమనార్హం. జిల్లా పంచాయతీ అధికారిగా పని చేసిన సురేశ్ సెప్టెంబర్ ఒకటిన బదిలీపై వెళ్లగా, నాటి నుంచి సూర్యాపేట డీఎల్‌పీఓకు అదనపు బాధ్యతలు అప్పగించారు. కోదాడ, అనంతగిరి, హుజూర్‌నగర్, చింతలపాలెం, జాజిరెడ్డిగూడెం, నడిగూడెం, మఠంపల్లి, నాగారం మండలాల్లో ఎంపీడీఓ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఎంపీడీఓ తరువాత పర్యవేక్షణ చేసే ఎంపీఓలు సైతం మూడు చోట్ల లేరు. సూర్యాపేట, గరిడేపల్లి మండలాల ఎంపీఓలు పదవీ విరమణ పొందగా, మేళ్లచెర్వు యంపీఓ జాజారెడ్డిగూడెంలో డిప్యూటేషన్ పని చేస్తున్నారు. జిల్లాలో స్థానిక సంస్థల పాలన ఎలా ఉందో దీన్ని బట్టి అర్థం చేసుకోవచ్చు.

స్వల్ప భూ ప్రకంపనలు

- ఉమ్మడి జిల్లాలో 2 నుంచి 4సెకన్ల పాటు కంపించిన భూమి
- గతంలో కృష్ణపట్టెలో పలుమార్లు భూకంపాలు
- ఆందోళనలో జనం

సూర్యాపేట, డిసెంబర్ 4 (నమస్తే తెలంగాణ) : ఉమ్మడి నల్లగొండ జిల్లా వ్యాప్తంగా బుధవారం ఉదయం 7.25గంటల నుంచి 7.30 గంటల మధ్య 2 నుంచి 4సెకన్ల పాటు భూమి స్వల్పంగా కంపించింది. పలు ప్రాంతాల్లో ఇండ్ల తలుపులు, కిటికీలు కదిలాయి. ఈ ప్రకంపనల వల్ల ఎలాంటి ముప్పూ వాటిల్లలేదు. సూర్యాపేట, మునగాల, చింతలపాలెం, నకిరేకల్, చౌటుప్పల్, కట్టంగూర్, నార్కట్‌పల్లి, చిట్యాల, రామన్నపేట, నల్లగొండ, మిర్యాలగూడ, పానగల్, కోదాడ, భువనగిరి, ఆత్మకూరు, గుండాల, యాదగిరిగుట్ట, అర్వపల్లి, నూతనకల్, పెన్‌పహాడ్, చివ్వెంల, నాగారాం, ప్రాంతాల్లో 3 నుంచి 4 సెకన్ల పాటు భూమి కదలగా ఇతర ప్రాంతాల్లో 2 సెకన్ల పాటు ప్రకంపనలు వచ్చినట్లు జనం చెప్తున్నారు. గతంలో కృష్ణా పరీవాహక ప్రాంతమైన చింతలపాలెం, మేళ్లచెర్వు, పాలకవీడు తదితర మండలాల్లో పలుమార్లు స్వల్ప భూకంపాలు వచ్చాయి. అప్పట్లో రిక్టర్ స్కేల్‌పై 2 నుంచి 4.3గా నమోదు తీవ్రత నమోదైంది. తాజాగా ములుగు జిల్లా మేడారం కేంద్రంగా వచ్చిన భూ కంపం 5.3 ఉండగా, దాని ప్రభావంతో 225 కిలోమీటర్ల పరిధిలో సంభవించిన ప్రకంపనల ప్రభావం వల్ల ఉమ్మడి జిల్లాలో కూడా భూమి కంపించినట్లు అధికారులు చెప్తున్నారు. భూప్రకంపనలను కొద్దిమంది స్వయంగా గుర్తించగా, మరి కొంత మంది మీడియా కథనాల ద్వారా తెలుసుకున్నారు. ముప్పై, నలభై ఏండ్ల నుంచి కూడా భూకంపం అంటే తెలియని ప్రాంతాల్లోనూ ప్రకంపనలు వచ్చాయని చర్చ జరుగడంతో ఒకింత ఆందోళన చెందారు. సాంకేతిక ఎంతో పెరిగినప్పటికీ భూప్రకంపనలు వచ్చే విషయం అధికారులు గుర్తించలేకపోతుండడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

కొండ కింద నిబంధనలకు నీళ్లు

టెండర్‌కు విరుద్ధంగా వైకుంఠ ద్వారం వద్ద శాశ్వత షెడ్డు

పుట్‌పాత్‌ను ఆక్రమించడంతో భక్తులకు ఇబ్బందులు

వైకుంఠ ద్వారం వద్ద నిర్మించిన శాశ్వత షెడ్డు

యాదగిరిగుట్ట, డిసెంబర్4: యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామివారి దేవస్థానంలో టెండరుదారులు ఇష్టారాజ్యం గా వ్యవహరిస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా మొబైల్ స్టాల్‌కు బదులు శాశ్వత షెడ్లను నిర్మిస్తున్నారు. పుట్ పాత్‌ను కబ్జా చేసి విక్రయాలు సాగిస్తున్నారు. గతంలోనూ లేనివిధంగా ఈసారి కొండ కింద వైకుంఠ ద్వారం మొబైల్ టీ, స్నాక్స్ స్టాల్ నిర్వహణకు రెండేండ్ల కాల పరిమితితో దేవస్థానం లీజ్ టెండర్ వేసింది. ఎమ్మెల్యే అనుచరులుగా చలామణి అవుతున్న కొంతమంది నాయకులు టెండర్‌ను స్వాధీనం చేసుకున్నారు. మొబైల్ స్టాల్‌ను ఏర్పాటు చేసి టీ, స్నాక్స్‌ను మాత్రమే విక్రయించాలని నిబంధనలో ఉన్నా.. అందుకు విరుద్ధంగా శాశ్వత షెడ్డును ఏర్పాటు చేశారు. పుట్ పాత్‌ను పూర్తిగా కబ్జా చేసి పర్మినెంట్ షెడ్డు వేశారు. దాంతో కొండపైకి వెళ్లే భక్తులతో పాటు వాహనాల పార్కింగ్, గిరిప్రదక్షిణ చేసే భక్తులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. స్వామివారి దర్శనానికి వచ్చే భక్తులు కొండకు చేరుకోగానే ముందుగా వైకుంఠ ద్వారం వద్ద స్వామివారికి మొక్కి కొబ్బరికాయ సమర్పిస్తారు. కొందరు వైకుంఠ ద్వారం నుంచే కొండపైకి మెట్ల మార్గం గుండా నడుచుకుంటూ వెళ్తారు. ఈ క్రమంలో కొద్దిమంది టీ తాగేందుకు వచ్చి సిగరెట్లు కూడా సైతం సేవిస్తూ భక్తులను అసౌకర్యం కల్పిస్తున్నారు. అన్ని టెండర్ల కాల పరిమితి ఏడాది మాత్రమే ఉండగా, వైకుంఠ ద్వారం వద్ద వేసిన స్టాల్‌కు మాత్రం రెండేండ్ల సమయం ఇచ్చారు. ఈ స్టాల్ స్థానిక ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య చేతుల మీదుగా ప్రారంభమవడం గమనార్హం.

శాశ్వత షెడ్డును తొలగించాలి

దేవస్థానం నిబంధనలకు విరుద్ధంగా మొబైల్ స్టాల్‌కు బదులు శాశ్వత షెడ్డును ఏర్పాటు చేశారు. దాంతో భక్తులకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. స్థానిక ఎమ్మెల్యే అండదండలతోనే శాశ్వత షెడ్డును నిర్మించారు. ఇంత జరుగుతున్నా దేవస్థాన ఈవో పట్టించుకోవడం లేదు. వెంటనే శాశ్వత షెడ్డును తొలగించాలి. లేనిపక్షంలో ఆందోళనకు దిగుతాం.

-పాపట్ల నరహరి, బీఆర్ఎస్ పట్టణ సెక్రటరీ జనరల్

మఠంపల్లి ఎస్ఐ రామాంజనేయులు సస్పెన్షన్

రామాంజనేయులు

మఠంపల్లి, డిసెంబర్ 4 : మఠంపల్లి ఎస్ఐ రామాంజనేయులును సస్పెండ్ చేస్తూ పోలీస్ శాఖ ఉన్నతాధికారులు